క్లుప్తంగా

హెచ్ఎంకు షోకాజ్ నోటీసు



పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా రాణికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలోని వృక్షాలను నరికినట్లు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో, ఈ విషయంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలోని 5 వృక్షాలు నరికించినట్లు స్పష్టమైందని చెప్పారు. విచారణలో వెల్లడైన విషయాలను డీఈఓకు పంపుతున్నట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అద్దెకు బస్టాండు ఖాళీ స్థలం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని అద్దెకు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆర్టీసీ ప్రాంగణంలోని బిట్-1, బిట్-2, బిట్-3, ఖాళీస్థలాల్లో వ్యాపార దుకాణాలు ఏర్పాటుచేసుకొనుటకు 15ఏళ్ల కాలానికి అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 11.30 గంటలకు ఆర్టీసీ డిపో వద్దకు రావాలని సూచించారు.

పశువైద్య శిబిరం



పశువుల మందుల గురించి వివరిస్తున్న పశువైద్యాధికారి అనిల్

పాములపాడు: మండలంలోని క్రిష్టారావుపేట గ్రామంలో పశువైద్యాధికారి అనిల్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భకోశ వ్యాధి శిబిరం, పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 10 గేదెలకు చూడి పరీక్షలు, 2 గేదెలకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు, 5 దూడలకు నట్టల నివారణ మందులులతో పాటు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్‌లు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెట్‌మ్యాన్ క్రైండ్ కంపెనీ ప్రతినిధి హర్ష, న్యాచురల్ రెబిడైస్ ప్రతినిధి శరత్ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

పాములపాడు: మండలం కేంద్రంలో పులిపాటి వెంకటరాముడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10,000 నగదును పంచాయతీ కార్యదర్శ ప్రభాకర్ మంగళవారం మృతుడి భార్య భాగ్యలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు శ్రీలత, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు సూర్యప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఏకై క షిరిడీ సాయిబాబా దేవాలయంగా వీరాజిల్లుతూ నేడు 36 వ వార్షికోత్సవం జరుపుతున్నామని తెలిపారు. మండలంలోని భక్తులు అందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కౌన్సిలర్లు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని 16, 17 వార్డుల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి మంగళవారం వార్డు కౌన్సిలర్లు అబ్దుల్‌రవూఫ్, పళ్ల సుధాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ రూ.20 లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, రామకృష్ణ, రమేష్, శ్రీను, వెంకటేశ్వరరెడ్డి, ఏఈ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉచిత ట్యాలీ కోర్సు

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఉచిత ట్యాలీ కోర్సును ప్రారంభించారు. కార్యక్రమంలో నంద్యాల నోడల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, లెక్చరర్లు వెంకటరెడ్డి, డాక్టర్ అమరావతి, డాక్టర మోహనమురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి



సమావేశానికి హాజరైన కన్వీనర్లు , గృహసారథులు

- సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలి
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దిశా నిర్దేశం

ఆత్మకూరు: పట్టణాల్లోను, గ్రామాల్లో కన్వీనర్లు, గృహసారథులు ప్రజలతో మమేకమై, ప్రజా సంక్షేమ పథకాలు అందేలా చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మంగళవారం 'మా నమ్మకం-నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అందజేయడమే కాకుండా ఎన్నికలో మ్యానిఫెస్టోలో, పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి అని చెప్పారు. పీర్ల కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లతో పాటు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు.

టీడీపీలోకి వెళ్లే ప్రసక్తే లేదు

తాము టీడీపీలోకి వెళ్తున్నట్లు కొన్ని మీడియాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, తాము ఆపార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి స్పష్టం చేశారు. తమకు మంత్రి పదవి ఇవ్వలేదని తప్పుడు ప్రచారాలు చేస్తూ, చర్చలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరణ, దీవెనలు తమకు ఉన్నాయని, మీ అభిమానంతో ముందుకు సాగుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ విజయంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా 175 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మకూరులో టీడీపీలో ఇద్దరు చేరితే 500 మంది చేరినట్లు, భారీ సంఖ్యలో చేరుతున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. నియోజకవర్గ అబ్జర్వర్ సురేందర్‌రెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డి, నూర్‌మహమ్మద్, ఫువ్వాడ భాస్కర్, సుల్తాన్, విజయచౌదరి, వరాల మాలిక్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతృప్తి

బండిఆత్మకూరు : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తితో ఉన్నారని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఎమ్మెల్యే శిల్పా ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం' నిర్వహించారు. ఇందులో మండలంలోని గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వీరికి దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రజలకు అర్థమయ్యేల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టరు శశికళరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరెడ్డి, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచు సంధ్య, వైస్ ఎంపీపీ ముంతల మధురాణి, ఎంపీటీసీలు పుల్లయ్య, కృష్ణమల్లారెడ్డి, పరమటూరు సహకార సంఘం చైర్మన్ శివలింగం, విక్రమసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో మహాశివరాత్రి ఏర్పాట్లు



ఆలయానికి కటాంజనాలు అమర్చిన దృశ్యం

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణా జలాలనుంచి పూర్తిగా బయపడింది. దీంతో ఆలయానికి మంగళవారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో కటాంజనాలు (గ్రిల్) బిగించారు. అదేవిధంగా వేసవి కాలం సమీపిస్తున్నందున ఆలయానికి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యంగా చలువపందిళ్లు, స్నానాలు ఆచరించుటకు నీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెలలో మహాశివరాత్రి ఉన్నందున ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు ఆలయపు రోహితులు తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

బండిఆత్మకూరు: నారాయణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు డాక్టరు కిరణ్‌కుమార్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సహకారంతో పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. పదిమంది వ్యాధిగ్రస్తులకు రూ. 10 వేలు విలువ చేసే కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజు, ల్యాబ్ టెక్నీషియన్ గౌసు, ఫార్మసిస్టు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు లాభదాయకం



మునగ పంటను పరిశీలిస్తున్న ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవి

కొత్తపల్లి: ఉద్యాన పంటల సాగుతో రైతులకు మెండైన ఆదాయం లభిస్తుందని ఆత్మకూరు క్లస్టర్ హార్టీకల్చర్ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవి అన్నారు. మంగళవారం మండలంలోని ముసలిమడుగు గ్రామ రైతులు సాగుచేసిన మునగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతిసారి ఒకే రకమైన పంటలు వేసుకోకుండా ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలన్నారు. వీటిసాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆర్జించవచ్చునన్నారు. మునగ సాగుచేసుకునేందుకు రైతులు ముందుకురావాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగుకు ప్రభుత్వం ఎకరానికి రెండు సంవత్సరాలకు రూ.లక్ష పెట్టుబడి రుణం ఇస్తుందని చెప్పారు. అలాగే ఉపాధి కూలీలకు మునగ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాసు, తదితరులు ఉన్నారు.

ఉత్పత్తి సంఘాలతో రైతుల అభివృద్ధి



మహిళా రైతులకు చెక్కును అందజేస్తున్న బాబురావు, ఏపీఎం అంబమ్మ

జూపాడుబంగ్లా: రైతులు స్వయం సహాయక రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మెరుగైన అభివృద్ధిని సాధించాలని ఎఫ్‌పీఓ జిల్లా యాంకర్ పర్సన్ బాబురావు, ఏపీఎం అంబమ్మ అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లా రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో చిరుధాన్యాలకు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు వాటి ఉత్పత్తిలో రాణించాలన్నారు. పండించిన ధాన్యాన్ని వారే స్వయం సహాయం సంఘాల ద్వారా విక్రయించుకోవచ్చునని తెలిపారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.6లక్షల రుణాల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీసీ కర్రెన్న, ఎఫ్ఎం బాలస్వామి, నాగన్న, రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల సభ్యులు చిన్నతిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోటారు సైకిళ్ల వేలం

పాములపాడు: స్థానిక పోలీసు స్టేషన్‌లోఈ నెల 8న మోటారు సైకిళ్ల వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ అశోక్ మంగళవారం తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 7 మోటారు సైకిల్స్‌కు సంబంధించిన యజమానులెవ్వరూ వాటి కోసం రాలేదన్నారు. దీంతో వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు 8వ తేదీ ఉద యం 9గంటలకు రూ.1,000టోకెన్ ఫీజు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు. పోలీ సుస్టేషన్ ప్రాంగణంలో తహసీల్దార్,ఆత్మకూరు సీఐల సమక్షంలో వేలం ఉంటుందని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో మొబైల్ ఆధార్ కేంద్రం

పగిద్యాల: 5 నుంచి 20 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి స్థానిక ఆదర్శ పాఠశాలను మ్యాపింగ్ చేసినట్లు డిజిటల్ అసిస్టెంట్ అశోక్ తెలిపారు. మంగళవారం మొబైల్ ఆధార్ కేంద్రంలో విద్యార్థుల 11 మంది విద్యార్థుల వివరాలు అప్‌డేట్ చేశారు. ఈ అవకాశాన్ని కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేడుకలను విజయవంతం చేద్దాం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 60 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వేడుకలను పూర్వ విద్యార్థులందరూ సమష్టి కృషితో విజవంతం చేయాలని నిర్వహించాలని పాఠశాల పూర్వ విద్యార్థి, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. త్వరలో వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా పాఠశాలను లక్ష్మీనారాయణతో కలిసి పూర్వ విద్యార్థులు మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక కృష్ణవేణి కల్యాణ మండపంలో వేడుకల నిర్వహణపై సమావేశాన్ని ఏర్పాటు చేసి, నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మహానందిలో ఉన్నతాధికారుల పూజలు



ఆర్డీఓ, డీఎస్పీలను సన్మానించిన ఆలయ అధికారులు

మహానంది: మహానంది ఆలయంలో నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి మంగళవారం పూజలు నిర్వహించారు. సమన్వయ కమిటీ సమావేశానికి వచ్చిన వారు ముందుగా శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు స్వాగతం పలికారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

దేవాలయాలకు ఎమ్మెల్యే విరాళం



కరివేన శ్రీఆంజనేయస్వామి దేవాలయానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయస్వామి దేవాలయం అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.లక్ష, మండలంలోని ముష్టపల్లి గ్రామంలో వెలిసిన మారెమ్మ గుడి అభివృద్ధికి రూ.50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సేవాదృక్పథంతో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, రవినాయక్, ఈశ్వర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో టీడీపీకే నష్టం

- వచ్చేఎన్నికల్లో టీడీపీ నామరూపాల్లేకుండా పోవడం ఖాయం
- సంక్షేమ పథకాలే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేస్తాయి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- నందికొట్కూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పక్షవాతంతో మంచానికి పరిమితమైన విజయభాస్కర్‌గౌడును పలకరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: పప్పుసుద్ద లోకేష్ పాదయాత్ర వల్ల టీడీపీకి నష్టమే తప్పా ప్రయోజనం శూన్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని 4వార్డు సచివాలయం పరిధిలోని గాంధీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేసి, మూడున్నరేళ్లలో ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎప్పుడు ఏం మాట్లాడుతాడో లోకేష్‌కే తెలియదు..

లోకేష్ ఎప్పుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదని, కనుక పాదయాత్ర వల్ల తెలుగుదేశం పార్టీకే నష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ నామరూపాల్లేకుండా పోవడం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించి ప్రజల ఆశీర్వాదాలతో సీఎం అయ్యాడని చెప్పారు. లోకేశ్ చేపట్టిన పాదయాత్ర వల్ల చంద్రబాబునాయుడు సీఎం కావడం కల్ల అన్నారు. పాదయాత్ర సమయంలో బడుగు, బలహీనవర్గాల సమస్యలను విని, కళ్లారాచూసి చలించి, సీఎం కాగానే ఇచ్చిన హామీల్లో 98శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్ రెడ్డిదేన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి

మున్సిపాలిటీ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ఇళ్లస్థలాలు, ఇళ్లు, పింఛన్ల మంజూరు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు వారిని శుభ్రంగా ఉంచటంలో చొరవచూపాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చేయాలన్నారు.

పాఠశాల పరిశీలన

గాంధీనగర్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేసి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని ఆయన ఎంఈఓ, సూపర్‌వైజర్లకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ షుకూర్‌మియ్య, మున్సిపల్ కమిషనర్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలరు జాకీర్ హుసేన్, ధర్మారెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ హుసేనయ్య, హరిసర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విక్టర్, మహిళా నాయకురాలు వనజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో 29 మోటార్ సైకిళ్లు, ఒక క్వాలిస్ వాహనాన్ని ఈనెల 9న వేలం వేయనున్నట్లు ఆత్మకూరు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఈ వాహనాలు కు సంబంధించిన యజమానులు ఎవరూ రాకపోవడంతో వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు రూ.1000టోకెన్ ఫీజ్ కట్టి పాల్గొనాలన్నారు.

ఎంఈఓను సస్పెండ్ చేయాలి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలో కనీస సౌకర్యాల్లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్న నందికొట్కూరు ఎంఈఓ ఫైజున్నిసాను సస్పెండ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ఆర్థర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో కనీస విద్యార్హతలు లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయించటంతో పాటు విద్యార్థులకు కనీస వసతులు లేకుండా పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయం పలుమార్లు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాఠశాల నిర్వాహకుడు డిప్యూటీ ఈఓ అనే ఉద్దేశంతో చర్యలు తీసుకునేందుకు ఎంఈఓ జంకుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆది, నాగార్జున, మహానంది, డక్కాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్యాం నిర్మాణాన్ని అడ్డుకోవాలి

జూపాడుబంగ్లా: తుంగభద్ర జలాశయం ఎగువన భద్రావతినదిపై కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న డ్యాం నిర్మాణాన్ని అడ్డుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా నాయకుడు వై నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆ పార్టీ కార్యాలయంలో అప్పర్ డ్యాం నిర్మాణాన్ని అడ్డుకోకపోతే సుంకేసుల జలాశయానికి వరదనీటి రాక తగ్గిపోతుందన్నారు. దీంతో కేసీ కాల్వ కిందున్న ఆయకట్టుకు సాగునీరు అందక ఏడారిగా మారే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, అరుణ్‌కుమార్, రామకృష్ణ, లక్ష్మన్న, శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక శ్రీశైలమాత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన పలువురిని ఆక్టుకుంది. విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తూ శాస్త్ర సాంకేతిక అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. పాఠశాల హెడ్ మాస్టర్ డైసీ సిందియారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ లవన్న, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వాహనాల వేలంలో రూ.4.12 లక్షల ఆదాయం



వాహనాల వేలం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన వివిధ వాహనాల వేలాల ద్వారా రూ. 4,12,000 ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ సీసీ నాగార్జున రెడ్డి తెలిపారు. ఐదు మోటారు సైకిళ్లు, ఒక టిప్పర్, బొలేరో 207 వాహనాలకు వేలాలు జరిగాయి. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాలకు చెందిన మెకానిక్‌లు వేలం పాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

20 ఏళ్ల నాటి సమస్య రెండు రోజుల్లో పరిష్కారం



నాడు ఇంట్లో నుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ లైన్



నేడు కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేసి ఎత్తులో నిర్మించిన దృశ్యం

- వెలుగోడు - నంద్యాల రోడ్డులో ఇళ్లలో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు
- ఎమ్మెల్యే శిల్పా చొరవతో సరిచేసిన అధికారులు

వెలుగోడు: 20 ఏళ్ల క్రితం నివాస గృహాలపై నుంచి 11 కేవీ విద్యుత్ లైను ఏర్పాటు చేయడంతో స్థానికులు భయందోళనతో బతికారు. పట్టణంలోని నంద్యాల రోడ్డులో నివాస గృహాల్లో నుంచి విద్యుత్ తీగలను తీసుకెళ్లడంతో ఎప్పుడు ఏ అపాయం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొత్తగా భవనాలు నిర్మించుకుందామంటే విద్యుత్ తీగలు అవరోధంగా మారాయి. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెలుగోడు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు నంద్యాల ప్రధాన రహదారిపై ఏర్పాటైన 11 కేవీ విద్యుత్ లైన్‌ను చూపించారు. తమ ఇంట్లో నుంచి కరెంటు తీగలు తీసుకెళ్లారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వెంటనే విద్యుత్ ఏఈ రవీంద్రనాయక్‌తో మాట్లాడి కొత్త లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 48 గంటలు గడవక ముందే అధికారులు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలను సరి చేశారు. దీంతో కాలనీవాసులు సంబు రామయ్య, తిరుపాలు, సురేష్, నూర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అసీఫ్ అలీఖాన్ ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు.